# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :67 | 23-09- 2026 | బుధవారం | పేజీలు: 4 | వెల:03/-


# రిమ్స్‌లో రాత్రి అగ్నికీలలు..

## పసికందుల ప్రాణాలు బలి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. నవజాత శిశువుల ప్రత్యేక సంరక్షణ విభాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆసుపత్రిలో భయానక పరిస్థితి నెలకొంది. దట్టమైన పొగతో శిశువులకు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారింది. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందారు. సుమారు 28 మంది చిన్నారులను సిబ్బంది, తల్లిదండ్రులు, అత్యవసర బృందాలు కలిసి బయటకు తరలించాయి.



అర్ధరాత్రి సమయంలో శిశువుల సంరక్షణ విభాగంలో ఏసీ యూనిట్ వద్ద మంటలు చెలరేగినట్లు ప్రాథమిక సమాచారం. క్షణాల్లోనే వార్డులో దట్టమైన పొగ కమ్ముకోవడంతో అక్కడ ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు, వైద్య సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. చిన్నారులను రక్షించేందుకు వార్డు అద్దాలను పగులగొట్టి బయటకు తరలించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇద్దరు నర్సులు, పలువురు ఆసుపత్రి సిబ్బంది కూడా చిన్నారులను రక్షించే క్రమంలో గాయపడ్డారు.

మంటలు అదుపులోకి వచ్చిన అనంతరం చిన్నారులను ఇతర ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి ఏసీ పనిచేయకపోవడం లేదా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమా అనే అంశాన్ని పోలీసులు, అగ్నిమాపక అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ఏర్పాట్లలో ఏమైనా


మిగతా వివరాలు రెండో పేజీలో..


# ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం

## శ్రీలంకపై ఘన విజయం.. మహిళా క్రికెట్ జట్టు చరిత్ర



నాగోయా/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: ఆసియా క్రీడలు--2026లో భారత్ పతకాల వేటను ఘనంగా ప్రారంభించింది. హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టు ఫైనల్లో శ్రీలంకపై 147 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఈ క్రీడల్లో భారత్ ఖాతాలో


మిగతా వివరాలు రెండో పేజీలో..


# ఎస్సీ, ఎస్టీల అభివృద్ధే లక్ష్యం

హైదరాబాద్: దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమవుతుందని, ఎస్సీ, ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి అధ్యక్షతన షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల అత్యాచారాల నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నతస్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ స్థాయి సమావేశం జరగడం ఇదే తొలిసారిగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన అత్యాచార కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న పరిహారం, సహాయం, పునరావాస చర్యలపై సమావేశంలో సమీక్షించారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరుపైనా చర్చించారు. గత ఐదేళ్లలో ఎస్సీ, ఎస్టీలపై నమోదవుతున్న అత్యాచార కేసులు క్రమంగా తగ్గుతున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. అయితే కొన్ని జిల్లాల్లోని 73 గ్రామాల్లో అధిక సంఖ్యలో కేసులు నమోదవుతున్నందున ఆయా ప్రాంతాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ


మిగతా వివరాలు రెండో పేజీలో..


# 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలు

న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అత్యంత ప్రతిష్టాత్మకమైన 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల విజేతల జాబితాను అధికారికంగా విడుదల చేసింది. భారతీయ చలనచిత్ర రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు మరియు నిర్మితమైన విశిష్ట చిత్రాలకు ఈ అత్యున్నత గౌరవం దక్కింది. దేశవ్యాప్తంగా వివిధ భాషల్లో వచ్చిన వైవిధ్యభరితమైన చిత్రాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతల మండలి ఈ పురస్కారాలను ప్రకటించింది. భారతీయ చిత్ర పరిశ్రమ వికాసానికి, సృజనాత్మకతకు అద్దం పట్టేలా ఈ ఏడాది పురస్కారాల ఎంపిక సాగింది. ఈ సారి జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో బాలీవుడ్ నిర్మించిన 'ఆర్టికల్ 370' చిత్రం ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా నిలిచి స్వర్ణ కమలాన్ని కైవసం



చేసుకుంది. కాగా ఉత్తమ నటుడి కేటగిరీలో తీవ్ర పోటీ నెలకొనగా, న్యాయ నిర్ణేతలు ఇద్దరు నటులకు ఉమ్మడిగా ఈ అవార్డును ప్రకటించారు. మలయాళ చిత్రం 'భ్రమయుగం' లో అద్భుత నటన కనబరిచిన దిగ్గజ నటుడు మమ్ముట్టి మరియు హిందీ చిత్రం 'చందు ఛాంపియన్' లో ప్రతిభ చూపిన కార్తిక్ ఆర్యన్ ఉమ్మడిగా ఉత్తమ నటుడు పురస్కారాన్ని దక్కించుకున్నారు. ఇక 'ఆర్టికల్ 370' చిత్రంలో కథానాయికగా శక్తివంతమైన పాత్రను పోషించిన యామీ గౌతమ్ ఉత్తమ నటిగా ఎంపికయ్యారు. తమిళంలో తెరకెక్కిన 'అమరన్' చిత్రానికి గాను రాజ్‌కుమార్ పెరియసామి ఉత్తమ దర్శకుడిగా జాతీయ అవార్డును సొంతం


మిగతా వివరాలు రెండో పేజీలో..


# తెలంగాణకు వాన హెచ్చరిక

## 11 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 22: తెలంగాణ రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) హెచ్చరిక జారీ చేసింది. ఆదిలాబాద్, జగిత్యాల, జనగామ, కరీంనగర్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.వర్షాలతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.పొలాల్లో పనులు చేసే రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వర్షం, పిడుగులు పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలో నిలబడవద్దని హెచ్చరించారు. వాహనదారులు కూడా ఈదురుగాలులు, వర్షం కారణంగా రహదారులపై ఎదురయ్యే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.

# అక్రమ అరెస్టులపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే పోలీసుల ఉద్యోగానికే ముప్పు!

న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నిందితుల అరెస్టుల విషయంలో అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన, సంచలన తీర్పును వెలువరించింది. పౌరుల రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ, చట్టబద్ధమైన పద్ధతిని పాటించకుండా చేసే అక్రమ అరెస్టులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అరెస్టు నిబంధనలను ఉల్లంఘించే రక్షకభట అధికారులపై కేవలం సాధారణ హెచ్చరికలతో సరిపెట్టకుండా, వారిపై కఠినమైన శాఖాపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారుల ఉద్యోగానికే ముప్పు వాటిల్లేలా తీవ్ర పరిణామాలు ఉంటాయని అత్యున్నత న్యాయస్థానం స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

జస్టిస్ ఉజ్జల్ భూయాన్ మరియు జస్టిస్ ఎస్. చందూర్కర్లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(1) ప్రకారము నిందితుడిని బంధించే ప్రతి సందర్భంలోనూ రాజ్యాంగబద్ధమైన స్పష్టమైన పద్ధతిని తప్పనిసరిగా అమలు చేయాలని కోర్టు తేల్చిచెప్పింది. నిందితుడిని




బంధించడానికి గల స్పష్టమైన కారణాలను అతనికి అర్థమయ్యే భాషలో వ్రాతపూర్వకంగా అందించాలని, కేవలం నోటిమాటగా సమాచారం ఇచ్చామని చెప్పడం ఎంతమాత్రం చెల్లదని స్పష్టం చేసింది. దీనితో పాటు నిందితుడికి తన


మిగతా వివరాలు 3వ పేజీలో..

# దేవుడికి కొబ్బరికాయ ఎందుకు కొడతాం..

దేవాలయానికి వెళ్లినప్పుడు చేతిలో పూలతో పాటు కొబ్బరికాయ ఉండటం మన సంప్రదాయంలో సర్వసాధారణం. గర్భగుడి ముందు నిలబడి భక్తితో ప్రార్థించిన తర్వాత కొబ్బరికాయను కొడతాం. కోరిక నెరవేరాలని, అడ్డంకులు తొలగాలని దేవుడిని వేడుకుంటాం. కానీ మనం దేవుడి ముందు కొబ్బరికాయనే ఎందుకు సమర్పిస్తాం? దాని వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావం ఏమిటి?

కొబ్బరికాయను మన సంప్రదాయంలో పవిత్రమైన ఫలంగా భావిస్తారు. దాని పైభాగంలో ఉండే గట్టి పొట్టు, లోపల ఉన్న తెల్లని భాగం, నీరు.. ఇవన్నీ కలిపి ఒక ప్రతీకాత్మక భావాన్ని కలిగిస్తాయి. బయటకు గట్టిగా కనిపించే పొట్టు మనిషిలోని అహంకారం, స్వార్థం, మమకారం వంటి వాటికి ప్రతీకగా భావించవచ్చు. ఆ పొట్టును పగలగొట్టిన తర్వాత లోపల కనిపించే స్వచ్ఛమైన భాగం.. మనసులోని నిర్మలత్వాన్ని గుర్తుచేస్తుంది.

అందుకే దేవుడి ముందు కొబ్బరికాయ కొట్టడం అంటే కేవలం ఒక పూజా విధానం కాదు.. 'నా అహంకారాన్ని నీ పాదాల దగ్గర వదిలేస్తున్నాను.. నా మనసును స్వచ్ఛంగా ఉంచుకునే శక్తిని ప్రసాదించు' అనే భావంతో సమర్పించుకోవడంగా కూడా



చూడవచ్చు.

కొబ్బరికాయలోని నీటిని కూడా పవిత్రతకు ప్రతీకగా భావిస్తారు. మనసులోని కల్మషాన్ని తొలగించుకుని, మంచి ఆలోచనలతో జీవించాలనే సంకల్పానికి అది ఒక గుర్తుగా నిలుస్తుంది. అందుకే కొబ్బరికాయ సమర్పణలో బయట కనిపించేది చిన్న ఆచారమే అయినా.. దాని వెనుక ఉన్న భావం మాత్రం చాలా లోతైనది.

కొంతమంది ఏదైనా పని ప్రారంభించే ముందు దేవుడికి కొబ్బరికాయ కొడతారు. దీని వెనుక 'అడ్డంకులు తొలగి పని సాఫీగా జరగాలి' అనే భక్తి విశ్వాసం ఉంటుంది. అయితే కొబ్బరికాయ కొట్టడం వల్లనే ప్రతి సమస్య పరిష్కారమవుతుందని భావించడం కంటే.. దేవుడిని స్మరించి మంచి సంకల్పంతో ముందుకు సాగడం ముఖ్యమని అర్థం చేసుకోవాలి.

పిల్లలు దేవాలయంలో కొబ్బరికాయ కొట్టడం చూసినప్పుడు.. 'ఎందుకు కొడుతున్నాం?' అని అడిగితే, 'దేవుడికి ఇష్టం కాబట్టి' అని మాత్రమే చెప్పకుండా.. 'మనలోని చెడు ఆలోచనలు, అహంకారాన్ని కూడా ఈ కొబ్బరికాయలా పగలగొట్టి మంచి మనసుతో ఉండాలని గుర్తుచేసుకోవడానికి' అని చెప్పగలిగితే ఆ ఆచారానికి మరింత అర్థం వస్తుంది.

దేవుడి ముందు కొబ్బరికాయ పగిలినప్పుడు శబ్దం ఒక్క క్షణమే వినిపిస్తుంది. కానీ ఆ శబ్దం మనలోని అహంకారం కూడా పగలాలని గుర్తుచేస్తే.. ఆ చిన్న ఆచారం ఒక గొప్ప ఆధ్యాత్మిక సాధనగా మారుతుంది. దేవుడి ముందు కొబ్బరికాయ పగలగొట్టడం సులభమే.. కానీ మనలోని అహంకారాన్ని పగలగొట్టడం అంత సులభం కాదు. అందుకే ఆలయంలో కొబ్బరికాయ సమర్పించే ప్రతిసారీ.. 'స్వామీ, నా కోరిక నెరవేర్చు' అని అడగడంతో పాటు, 'నా మనసును మంచిగా మార్చు.. నా మాటల్లో నిజాయితీ ఇవ్వు.. నా చేతులతో మంచి పనులు చేయించు' అని కోరుకుంటే.. అదే కొబ్బరికాయ సమర్పణకు నిజమైన అర్థం అవుతుంది.



సీనియర్ జర్నలిస్ట్
యోగేష్ కుమార్

# కలానికి గౌరవం.. చట్టానికి విధేయత!

## కళ్లు, చెవులు జర్నలిస్టులే.. పోలీసుల తోడ్పాటే శ్రీరామరక్ష!

ప్రజాస్వామ్య వ్యవస్థ సుదృఢంగా నిలబడాలన్నా, సామాన్య పౌరుడికి చట్టబద్ధమైన న్యాయం అందాలన్నా సమాజంలో రెండు ప్రధాన వ్యవస్థలు నిరంతరం పరస్పర అవగాహనతో శ్రమించాల్సి ఉంటుంది. అందులో మొదటిది చట్టాన్ని పరిరక్షిస్తూ శాంతిభద్రతలను కాపాడే రక్షణ యంత్రాంగం కాగా, రెండవది సమాజంలో జరుగుతున్న పరిణామాలను, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తెస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా నిలిచే పత్రికారంగం. ఈ రెండు వ్యవస్థలు నాణేనికి బొమ్మ బొరుసు లాంటివి. ప్రజా సంక్షేమం, నేర రహిత సమాజ నిర్మాణం, సామాజిక న్యాయం అనేవి ఈ రెండు రంగాల అంతిమ లక్ష్యాలు అయినప్పుడు, వీరి మధ్య ఉండాల్సింది ఘర్షణాత్మక వైఖరి కానే కాదు. కేవలం స్నేహపూర్వక సమన్వయం, పారదర్శక అవగాహన, పరస్పర గౌరవం మాత్రమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్షగా నిలుస్తాయి.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 6 మంది విలేకరులతో పాటు ఆదిలాబాద్ జిల్లాలోని అదిలాబాద్ వంటి ప్రాంతాల్లో ఇటీవల 22 మంది క్షేత్రస్థాయి విలేకరులకు, రక్షణ అధికారులకు మధ్య తలెత్తిన కొన్ని సంఘటనలు, సమాచార లోపాలు, అపోహల వల్ల కొంత ఆందోళనకర వాతావరణం నెలకొన్న మాట వాస్తవమే. అయితే, వీటిని కేవలం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడానికో లేదా పగ, ప్రతీకారాలు పెంచుకోవడానికో ప్రాధాన్యత ఇవ్వకూడదు. విమర్శలు, ఆరోపణల కన్నా ఇరువర్గాల మధ్య పరస్పర గౌరవంతో కూడిన సంభాషణలు, చర్చలే సమాజానికి మేలు చేస్తాయి. లోపాలను సరిదిద్దుకుంటూ, ఇరు వ్యవస్థల గౌరవాన్ని నిలబెట్టుకుంటూ ఒకరికొకరు తోడ్పాటు నందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



రక్షణ యంత్రాంగం రాత్రింబవళ్లు తమ కుటుంబాలను, ఆరోగ్యాన్ని సైతం పక్కనపెట్టి ప్రజల భద్రత కోసం అత్యంత ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో పనిచేస్తుంది. శాంతిభద్రతల పరిరక్షణలో వారు పడే శ్రమ, చేసే త్యాగాలు ఎనలేనివి. మరోవైపు క్షేత్రస్థాయి వార్తాహరులు కూడా ఏ విధమైన ప్రత్యేక వేతన భద్రత లేదా సౌకర్యాలు లేకపోయినా సమాజం పట్ల ఉన్న బాధ్యతతో ముందుకు సాగుతారు. భౌతిక శ్రమను లెక్కచేయకుండా, వాతావరణ ప్రతికూలతలను తట్టుకుంటూ నిరంతరం సమాచార సేకరణలో శ్రమిస్తారు. నిజానికి, రక్షణ వ్యవస్థకు విలేకరులు వైరుధ్యంగా నిలిచేవారు కారు. వారు ప్రమాదాలను, అక్రమాలను ముందే గుర్తించి యంత్రాంగానికి తెలియజేసే కళ్లు, చెవుల లాంటివారు. సమాజంలో నేరాలను అరికట్టడంలో, చట్టాన్ని శక్తివంతంగా అమలు చేయడంలో విలేకరులు అందించే ప్రాథమిక సమాచారం ఎంతగానో ఉపకరిస్తుంది. అదే సమయంలో రక్షణ యంత్రాంగం సాధించిన విజయాలను, ప్రజలకు వారు అందిస్తున్న ఉత్కృష్ట సేవా కార్యక్రమాలను సమాజానికి వివరిస్తూ వారి నైతిక ధైర్యాన్ని, సముచిత గౌరవాన్ని పెంచడంలో వార్తాపత్రికలు, ప్రసార మాధ్యమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి.

కొన్ని సందర్భాల్లో క్షేత్రస్థాయిలో వార్తలు రాసే సమయంలో లేదా విచారణాధికారుల పరిధిలో సమాచార మార్పిడి సరిగా జరగకపోవడం వల్ల చిన్న చిన్న ఘర్షణలు లేదా అపోహలు చోటుచేసుకుంటాయి. అటువంటి సందర్భాల్లో తక్షణమే అక్రమ కేసులు బనాయించడం లేదా ఆగ్రహంతో ఆందోళన బాట పట్టడం ఇరు వర్గాలకు ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు. జిల్లా స్థాయి అధికారులు, పత్రికా సంఘాల నాయకులు కలిసి ప్రతి నెలా లేదా క్రమం తప్పకుండా ఉమ్మడి సమన్వయ సమావేశాలు నిర్వహించాలి. ఇటువంటి సంభాషణా వేదికల ద్వారా ఏవైనా సమస్యలు లేదా అపోహలు తలెత్తితే ముఖాముఖి చర్చించి ప్రశాంత వాతావరణంలో పరిష్కరించుకునే అనుకూల అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా, పత్రికా ప్రతినిధుల హక్కుల కోసం పనిచేసే సంఘాలు కూడా కేవలం ఘర్షణాత్మక ధోరణికి పోకుండా, అధికారులతో సానుకూల వాతావరణంలో సంప్రదింపులు జరిపే సంధి వంతెనగా మారాలి. తోటి విలేకరి ఎదుర్కొంటున్న చట్టపరమైన లేదా వృత్తిపరమైన చిక్కులను సౌమ్యంగా, అవగాహనతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలి. అదే సమయంలో, రక్షణ రంగానికి చెందిన ఉన్నతాధికారులు కూడా తమ కింది స్థాయి సిబ్బందికి పత్రికా వృత్తిధర్మం పట్ల, భావప్రకటనా స్వేచ్ఛ పట్ల సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. వార్తాహరులను సమాజంలో తమ సహజ సిద్ధమైన భాగస్వాములుగా భావించి, వారు స్వేచ్ఛగా, ఎటువంటి భయం లేకుండా పనిచేసే అనుకూల వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత రక్షణ యంత్రాంగంపై ఎంతైనా ఉంది. వార్తల రూపకల్పనలో నిజాయితీ, నిష్పాక్షికతలను పాటించడం జర్నలిస్టుల కనీస బాధ్యత. నిర్ధారణ లేని వార్తలను ప్రచురించడం వల్ల వ్యవస్థల ప్రతిష్ట దెబ్బతినే ప్రమాదం ఉందనే సత్యాన్ని గ్ర గ్రహించాలి. అదే రీతిలో చట్టాన్ని అమలు చేసే క్రమంలో ప్రజాస్వామ్య సూత్రాలను, పౌరుల స్వేచ్ఛను పరిరక్షించడం అధికారుల ధర్మం. ఒకరి పరిమితులను మరొకరు అర్థం చేసుకున్నప్పుడే వివాదాలకు తావుండదు. ”చట్టం తన పని తాను చేసుకుపోవాలి, కలానికి తన నిర్భయ స్వేచ్ఛ ఉండాలి” అనే సూత్రంతో పాటు “సమన్వయంతోనే సమాజ శ్రేయస్సు సాధ్యం” అనే శాశ్వత సత్యాన్ని ఇరు వర్గాలు స్పష్టంగా గుర్తించాలి. విమర్శల కంటే పరస్పర సహకారం, కక్షసాధింపుల కంటే స్నేహపూర్వక వాతావరణం ప్రజాస్వామ్య వ్యవస్థకు జీవగర్రగా నిలుస్తాయి. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని రక్షణ అధికారులు, విలేకరుల సంఘాలు తమ మధ్య ఉన్న చిన్నపాటి విభేదాలను, మౌనాన్ని పక్కనపెట్టి, సామరస్యపూర్వకంగా ఒకే తాటిపైకి రావాలి. ఇరు వ్యవస్థలు ఒకరినొకరు గౌరవించుకుంటూ, సమాజంలో న్యాయాన్ని, శాంతిని కాపాడేందుకు చేతులు కలిపినప్పుడే పౌరులకు సంపూర్ణ భద్రత, ప్రజాస్వామ్యానికి నిజమైన విజయం చేకూరుతాయి. ఈ స్నేహపూర్వక అనుబంధం నిరంతరం కొనసాగాలని ఆశిద్దాం.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# రిమ్స్‌లో రాత్రి అగ్నికీలలు..

లోపాలున్నాయా అనే అంశాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత స్పష్టమయ్యే అవకాశం ఉంది.ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నారుల మృతి బాధాకరమని పేర్కొంటూ వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. చికిత్స పొందుతున్న మిగతా చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు.వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఘటనపై ఉన్నతాధికారులతో సమీక్షించి రిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న చిన్నారుల పరిస్థితిని తెలుసుకుని వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి కారణాలను తక్షణమే విచారించాలని సూచించారు.ఇదిలా ఉండగా, రిమ్స్ ఘటనపై తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. చిన్నారుల మృతి విషయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కంటే మంత్రి వ్యవహరించిన తీరే తనను ఎక్కువగా బాధించిందని ఆమె విమర్శించారు. ఘటన మానవ తప్పిదం వల్ల జరిగిందని, ఏసీ నిర్వహణ సరిగా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని చెబుతున్నారని పేర్కొన్నారు. అయితే ప్రమాదానికి అసలు కారణం దర్యాప్తులో తేలాల్సి ఉందని ఆమె వ్యాఖ్యల నేపథ్యంలో స్పష్టత అవసరం.ముగ్గురు చిన్నారులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం కనీస ఆర్థిక సహాయం అందించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు పేద కుటుంబాలే వస్తారని, మృతి చెందిన చిన్నారుల్లో ఇద్దరు మైనార్టీ కుటుంబాలకు చెందినవారు, ఒకరు ఆదివాసీ కుటుంబానికి చెందినవారని పేర్కొన్నారు. కనీసం అంత్యక్రియల నిర్వహణకు కూడా సహాయం చేయలేదని ఆమె విమర్శించారు.మంత్రి ఘటన స్థలానికి వచ్చిన సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం ప్రకటిస్తారని భావించామని, కానీ అలాంటి భరోసా ఇవ్వలేదని కవిత ఆరోపించారు. మంత్రి పర్యటనను కూడా ఆమె విమర్శిస్తూ, ఘటనపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రతా పరిస్థితులు, విద్యుత్ వ్యవస్థ, వైద్య పరికరాల నిర్వహణపై ముఖ్యమంత్రి సమగ్ర ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.రిమ్స్ ఘటనలో మృతి చెందిన చిన్నారుల కుటుంబాలకు తెలంగాణ రక్షణ సేన తరఫున ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని కవిత ప్రకటించారు. బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు ఆదిలాబాద్‌కు వెళ్లనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు.మరోవైపు, ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు కొనసాగుతోంది. రిమ్స్ వంటి కీలక ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువుల విభాగంలోనే అగ్నిప్రమాదం చోటుచేసుకోవడంతో ఆసుపత్రుల ఫైర్ సేఫ్టీ, విద్యుత్ వ్యవస్థ, పరికరాల నిర్వహణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దర్యాప్తు నివేదికలో వెలువడే కారణాలు, బాధ్యతలు, భద్రతా లోపాలపై తదుపరి చర్యలు ఇప్పుడు కీలకంగా మారాయి.

# ఎస్సీ, ఎస్టీల అభివృద్ధే లక్ష్యం

సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. అత్యాచార ఘటనల్లో బాధితులకు సకాలంలో పరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని సూచించారు. బాధితులకు పరిహారం అందించడంలో బడ్జెట్ పరిమితులను అడ్డంకిగా మారనివ్వకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలని ఆదేశించారు.ఇటీవల షాబాద్ హత్యల ఘటన, తుక్కుగూడలో నర్సుపై హత్యాచార ఘటనలను సీఎం ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని సీఎం తెలిపారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం పనిచేస్తోందని, జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఎస్సీ జనాభా సుమారు 16 శాతం ఉండగా ఇందిరమ్మ ఇళ్లలో 31 శాతం లబ్ధిదారులు ఎస్సీలేనని, ఎస్టీ జనాభా సుమారు 10 శాతం ఉండగా వారికి 17 శాతం ఇళ్లు మంజూరు చేసినట్లు వివరించారు.రాష్ట్రంలో 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని సీఎం తెలిపారు. 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ ద్వారా పేద, దళిత, గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కలుగుతోందన్నారు.సంక్షేమ పథకాలతో పాటు విద్యే అట్టడుగు వర్గాల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురాగలదని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పిల్లలను చదువు, క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కలిసి పనిచేద్దామని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు.

# ఆసియా క్రీడల్లో భారత్‌కు తొలి స్వర్ణం

తొలి స్వర్ణం చేరింది. వరుసగా రెండోసారి ఆసియా క్రీడల్లో మహిళా క్రికెట్‌లో స్వర్ణం సాధించి భారత జట్టు మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకుంది.టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ తొలి వికెట్‌కు 99 పరుగులభాగస్వామ్యాన్ని నెలకొల్పి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. షెఫాలీ వర్మ 29 బంతుల్లో 48 పరుగులు చేసి ఆకట్టుకోగా, స్మృతి మంధాన 45 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 79 పరుగులు చేసి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడింది.ఆ తర్వాత రిచా ఘోష్ కూడా వేగంగా పరుగులు సాధించింది. కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 49 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. దీంతో భారత్ నిర్ణీత ఓవర్లలో 216/3 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసింది. ఆసియా క్రీడల మహిళా క్రికెట్ చరిత్రలో ఇది అత్యధిక స్కోర్‌గా నిలిచింది. భారత బ్యాటర్లు మొత్తం 13 సిక్సర్లు బాదడంతో ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు బ్యాటింగ్ దూకుడు స్పష్టంగా కనిపించింది.భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు. ముఖ్యంగా భారత స్పిన్నర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో శ్రీలంక బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ కేవలం 6 పరుగులకే మూడు వికెట్లు తీసి శ్రీలంక బ్యాటింగ్ వెన్నువిరిచింది.

# కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 5.53 లక్షలు

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దిలావర్‌పూర్ మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాల్వ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును మంగళవారం ఆలయ ప్రాంగణంలో పర్యవేక్షకుల సమక్షంలో చేపట్టారు. శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా మొత్తం రూ. 5,53,490 నగదు సమకూరినట్లు ఆలయ చైర్మన్ అంగూర్ మహేందర్ వెల్లడించారు.



ఈ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఈవో బాపిరెడ్డి, కదిలి ఈవో రాజేష్, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు పటేల్, పూజారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చించోలి (బి) జెడ్పీ పాఠశాలలో విద్యా ప్రమాణాలపై కాంప్లెక్స్ సమావేశం

సారంగాపూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులకు విద్యా విషయక సమీక్షా సమావేశం జరిగింది. స్టేట్ ఎఫ్ఎల్ఎన్ అబ్జర్వర్ శ్యామ్ రాథోడ్, అకడమిక్ ప్యానెల్ సభ్యుడు టి. గంగాదాస్ హాజరై ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఫ్లీచీ) అమలుపై దిశానిర్దేశం చేశారు. తరగతి గదిలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టాఎం) వినియోగిస్తూ ఆకర్షణీయంగా బోధించాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం రెమిడియల్




బోధన చేపట్టాలన్నారు. సమావేశానికి హెచ్ఎం ఎ. మునిందర్ రాజు సమన్వయకర్తగా వ్యవహరించగా, రిసోర్స్ పర్సన్లు మొయిజోద్దీన్, శ్రీనివాస్‌రెడ్డి, పవన్, గణేష్ పాల్గొన్నారు.

# ఆదర్శనగర్ మినీ ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్

నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని ఆదర్శనగర్‌లో మినీ ఖైరతాబాద్ గణేష్ మండలి ఆధ్వర్యంలో కొలువుదీరిన భారీ వినాయకుడిని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో



పాల్గొని భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిధులు వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోపు గోపి, ఎస్పీ రాజు, కత్తి నరేందర్, లక్కాకుల హరీష్, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల,సెప్టెంబర్ 22, తెలంగాణ వెన్నెల వాక్కు
జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ లో గల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటి వరకు జరిగిన పురోగతిని సమీక్షించి, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందించిన ఓటర్లకు హియరింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఈ



క్రమంలో సంబంధిత ఓటర్ల క్లెయిమ్స్, అభ్యంతరాలు త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ పొదుపుతోనే కుటుంబానికి ఆర్థిక భరోసా: నిర్మల్ సర్కిల్ ఎస్ఈ ఎ. రమేష్

## ఏసీలను 24 డిగ్రీల వద్దే వాడాలి.. బీఈఈ స్టార్ రేటింగ్ పరికరాలనే ఎంచుకోవాలి

నిర్మల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
గృహ వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడటం వల్ల విద్యుత్ బిల్లులు తగ్గడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని, తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సహజ వనరులు కాపాడబడతాయని నిర్మల్ విద్యుత్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ఎ. రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన విద్యుత్ ఆదాపై వినియోగదారులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి కుటుంబం రోజుకు కనీసం 2 యూనిట్ల విద్యుత్‌ను ఆదా చేస్తే నెలకు 60 యూనిట్లు, ఏడాదికి సుమారు 730 యూనిట్ల వరకు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ముఖ్యంగా గృహాల్లో ఏసీలను అవసరానికి మించి తక్కువ ఉష్ణోగ్రత వద్ద కాకుండా 24 డిగ్రీల సెల్సియస్ లేదా అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రత వద్ద నడపడం ద్వారా విద్యుత్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని స్పష్టం చేశారు. ఏసీ ఫిల్టర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, అవసరం లేని సమయాల్లో లైట్లు, ఫ్యాన్లు వెంటనే ఆపివేయాలన్నారు. కొత్త పరికరాలు కొనేటప్పుడు తప్పనిసరిగా బీఈఈ (దీజుజు) స్టార్ రేటింగ్‌ను పరిశీలించాలని, విద్యుత్ పొదుపును ఒక కార్యక్రమంగా కాకుండా నిత్య జీవనశైలిగా మార్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# తాండూర్, బెల్లంపల్లిలలో కలెక్టర్ కుమార్ దీపక్ విస్తృత పర్యటన

## పాఠశాల పనుల వేగవంతం.. ద్వారకాపూర్‌లో రీ-సర్వే పరిశీలన.. గోశాల నిర్మాణానికి భూమిపూజ

మంచిర్యాల, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తాండూర్ మండలం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ద్వారకాపూర్ గ్రామంలో జరుగుతున్న ప్రతిష్టాత్మక భూముల రీ-సర్వే ప్రక్రియను తహశీల్దార్ జ్యోత్స్నతో కలిసి పరిశీలించి, ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా రికార్డులు రూపొందించాలని సూచించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పింఛన్ల దరఖాస్తుల వివరాలను ఆరా



తీశారు. స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసి గర్భిణులకు మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో భారత జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో 1 ఎకరం 15 గుంటల విస్తీర్ణంలో తలపెట్టిన నూతన గోశాల నిర్మాణ పనులకు డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, పీడీ అజయ్ మణికుమార్‌లతో కలిసి కలెక్టర్ భూమిపూజ చేశారు. మంచిర్యాలలో

# గూడెం వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

లక్షెట్టిపేట/మంచిర్యాల, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
వినాయక నిమజ్జన వేడుకలను ప్రజలంతా మతసామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట మండలంలోని గూడెం గోదావరి తీరంతో పాటు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్లను తహశీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, పోలీసు అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల వద్ద క్రేన్లు, నిరంతర విద్యుత్ దీపాలు, బారికేడింగ్, తాగునీరు మరియు పారిశుధ్య ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. నీటిలోకి ఎవరూ దిగకుండా గజ ఈతగాళ్ల బృందాలను నిరంతరం



అందుబాటులో ఉంచాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

# బోసి కర్ర వినాయకుడి సన్నిధిలో రబీంద్ర హైస్కూల్ విద్యార్థుల సాంస్కృతిక సందడి

ముధోల్/తానూరు, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూరు మండలం బోసి గ్రామంలో కొలువైన శ్రీ వరసిద్ధి కర్ర వినాయక ఆలయ ప్రాంగణంలో ముధోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో భక్తి గీతాలు, దేశభక్తి గేయాలు మరియు జానపద నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. విద్యార్థుల ప్రదర్శనను తిలకించిన ఆలయ కమిటీ సభ్యులు,



భక్తులు వారిని ప్రశంసించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అసంవర్ సాయినాథ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి, భారతీయ సంస్కృతిపై అవగాహన పెంచడానికి ఇలాంటి వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. క్రమశిక్షణతో ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను అభినందించారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU


# గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిర్వాసితులకు తగిన సహాయం అందిస్తాం

### నిగ్వా గ్రామంలో నిర్వాసితులతో కలెక్టర్ ముఖాముఖి.. ఎస్సీ కాలనీలో బోరుబావులకు ఆదేశం

కుబీర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిర్మాణం వల్ల కుబీర్ మండలం నిగ్వా గ్రామంలో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం తరఫున వీలైనంత త్వరగా న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన నిగ్వా గ్రామాన్ని స్వయంగా సందర్శించి బాధితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్వాసితుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, నిలిచిపోయిన ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పునరావాసం కోసం గుర్తించిన 26 ఎకరాల భూమిపై ఉన్న సాంకేతిక, రెవెన్యూ చిక్కులను వెంటనే పరిష్కరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ



నిర్దేశిత గడువులోగా స్థలాలు అందించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు విన్నవించగా, కలెక్టర్ తక్షణమే స్పందించి అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా బోర్‌వెల్స్ వేయించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ రమేష్ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా ఘనంగా 'స్వచ్ఛతా హి సేవా--2026' మట్టి గణపతుల నిమజ్జనం

### నిమజ్జనం చేసిన మట్టితో మొక్కలు నాటిన అధికారులు, సిబ్బంది

నిర్మల్/దిలావర్‌పూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): 'స్వచ్ఛతలో భాగస్వామ్యం--స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్' నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా--2026 కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 18 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి గణపతుల నిమజ్జనం, పర్యావరణ పరిరక్షణ అవగాహన




సదస్సులు నిర్వహించారు. దిలావర్‌పూర్ మండలంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిణి (డీఆర్‌డీవో) విజయలక్ష్మి, ముధోల్‌లో ఎంపీడీవో లవకుమార్ పాల్గొని శాస్త్రోక్తంగా మట్టి గణపతులను నిమజ్జనం చేశారు. అనంతరం ఆ మట్టిని వృథా చేయకుండా అక్కడే మొక్కలు నాటి పర్యావరణ స్పృహను చాటారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీవోపీ) విగ్రహాల వల్ల జలవనరులు కలుషితమవుతాయని, ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని పిలుపునిచ్చారు. సిబ్బందితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ అక్షర అనిల్, ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవోలు గోవర్ధన్, శివకుమార్, సెర్ప్, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒకే మట్టి వినాయకుడు.. రెండు స్పీకర్లతో ఆదర్శంగా నిలిచిన గన్నోరా గ్రామం

ముధోల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): గణేష్ ఉత్సవాల నిర్వహణలో ముధోల్ మండలం గన్నోరా గ్రామం జిల్లాకే ఆదర్శంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ మరియు గ్రామ ఐక్యతే ధ్యేయంగా గ్రామ ప్రజలంతా ఒక్కటై గ్రామానికి ఒకే ఒక మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. శబ్ద కాలుష్యాన్ని అరికట్టేందుకు భారీ డీజేలను పూర్తిగా పక్కనపెట్టి కేవలం రెండు సాధారణ సౌండ్ బాక్సులతోనే ఉత్సవాలు నిర్వహించడం విశేషం. సర్పంచ్ అప్పల రాజు తీసుకున్న ఈ వినూత్న నిర్ణయాన్ని గ్రామస్తులు హర్షించారు. మంగళవారం గ్రామాన్ని



సందర్శించిన ముధోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ గ్రామస్తుల ఐక్యతను, పర్యావరణ స్పృహను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అప్పల రాజు, ఉపసర్పంచ్ నర్సారెడ్డి, గ్రామస్తులు ఎస్సైని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సాపేవార్ కిష్టయ్య, భోజందర్ రెడ్డి, దశరథ్, రాజు పాల్గొన్నారు.

# భైంసాలో 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు: గణేష్ నిమజ్జనోత్సవం ప్రారంభం

### తొలి విగ్రహాన్ని నిమజ్జనం చేసిన జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల, ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా పట్టణంలో వినాయక నిమజ్జనోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా, కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రారంభమైంది. గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిమజ్జన ఘాట్ వద్ద భారీ క్రేన్ సహాయంతో జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఐపీఎస్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి తొలి గణపతి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా



నిమజ్జనం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 700 మంది సిబ్బంది, ఒక అదనపు ఎస్పీ, 14 మంది డీఎస్పీలు, 18 మంది సీఐలు, ఎస్సైలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర మార్గాలు, కూడళ్లలో 100కు పైగా సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచారు. ట్రాఫిక్ సమస్యలు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా, భైంసా ఏఎస్పీ సాయికుమార్, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ చైర్మన్ తుమ్మోల్ల దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు.

# చత్తీస్‌గఢ్ ఆదివాసీలకు విధించిన మరణశిక్షను రద్దు చేయాలి

నిర్మల్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): చత్తీస్‌గఢ్‌లోని ఎన్ఐఏ కోర్టు 10 మంది నిర్దోషులైన ఆదివాసీలకు విధించిన మరణశిక్షను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 2013లో బస్తర్ జిల్లా జిరంఘాటి వద్ద కాంగ్రెస్ పరివర్తన ర్యాలీపై జరిగిన దాడి ఘటనలో 10 మంది ఆదివాసీలను నిందితులుగా చేర్చి 13 ఏళ్లుగా జైల్లో నిర్బంధించి



ఉరిశిక్ష విధించడం అన్యాయమన్నారు. బస్తర్ ప్రాంతంలో గతంలో సల్వాజూడుం పేరుతో సాగిన దాడుల్లో వందలాది మంది ఆదివాసీలు బలికాగా, సుప్రీంకోర్టు సల్వాజూడుంను చట్టవిరుద్ధమని ప్రకటించిందని గుర్తుచేశారు. రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వాలు ప్రకటించినందున, మావోయిస్టు కేసుల పేరుతో శిక్షలు ఎదుర్కొంటున్న ఆదివాసీలను బేషరతుగా విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు.

# ఆదిలాబాద్ రిమ్స్ పిల్లల వార్డులో షార్ట్ సర్క్యూట్: జోగు రామన్న పరామర్శ

### ముగ్గురు చిన్నారుల మృతిపై సమగ్ర విచారణ జరపాలని మాజీ మంత్రి డిమాండ్

ఆదిలాబాద్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని పిల్లల వార్డులో ఎయిర్ కండిషనర్ (ఏసీ) నుంచి అకస్మాత్తుగా షార్ట్ సర్క్యూట్ సంభవించి ప్రమాదం జరగడం తీవ్ర కలకలం రేపింది. వార్డులో పొగలు అలుముకోవడంతో రోగులు, తల్లిదండ్రులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి జోగు రామన్న హుటాహుటిన రిమ్స్‌కు చేరుకుని పిల్లల వార్డును పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి ప్రమాద వివరాలు, చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.



ప్రభుత్వ ఆసుపత్రుల్లో విద్యుత్ పరికరాల నిర్వహణ లోపమే ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ, ఘటనపై ఉన్నతస్థాయి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



# పర్యాటక దినోత్సవ డ్రాయింగ్ పోటీల్లో గుండంపల్లి విద్యార్థిని మనోజ్ఞకు జిల్లా ద్వితీయ స్థానం

దిలావర్‌పూర్, సెప్టెంబర్ 22 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని (సెప్టెంబర్ 27) పురస్కరించుకుని యువ టూరిజం క్లబ్ ఆధ్వర్యంలో నిర్మల్ సోఫీనగర్ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి డ్రాయింగ్ పోటీల్లో గుండంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థిని మనోజ్ఞ జిల్లా స్థాయిలో ద్వితీయ




బహుమతి సాధించింది. పాఠశాల, మండల స్థాయిల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మనోజ్ఞ అద్భుత చిత్రలేఖనంతో సత్తా చాటింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మనోజ్ఞతో పాటు శిక్షణ అందించిన ఆర్ట్ టీచర్ సాయినాథ్‌ను పాఠశాల హెచ్‌ఎం సిలారి మధుసూదన్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఘనంగా అభినందించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER